సాక్షి రంగారెడ్డి

గురువారం । 4 । జనవరి । 2024



అప్‌డేట్ అవస్థలు

ప్రభుత్వం ఏ పథకం ప్రారంభించినా ఆధార్ అనుసంధానం చేయాల్సి వస్తోంది. దీంతో ఆయా కేంద్రాలకు క్యూ కడుతున్నారు. 8లో▸



కార్గో రూట్‌లో మెట్రో!

మెట్రోను శంషాబాద్ ఎయిర్‌పోర్టు వరకు విస్తరించడానికి మొగ్గు చూపడంతో స్థానికులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. 8లో▸




దరఖాస్తు చేసుకోవాలి

అర్హులందరూ ప్రజాపాలనలో అభయహస్తం కోసం దరఖాస్తు చేసుకోవాలని అదనపు కలెక్టర్ ప్రతిమాసింగ్ అన్నారు. 8లో▸

న్యూస్‌రీల్

పవన్‌కుమార్‌రెడ్డి బాధ్యతల స్వీకరణ



పవన్‌కుమార్‌రెడ్డి

మొయినాబాద్: మొయినాబాద్ ఇన్‌స్పెక్టర్‌గా గుడి పవన్‌కుమార్‌రెడ్డి బాధ్యతలు చేపట్టారు. మియాపూర్ డివిజన్ సైబర్ క్రైం ఇన్‌స్పెక్టర్‌గా ఉన్న ఆయనను మొయినాబాద్ పోలీస్‌స్టేషన్‌కు బదిలీ చేస్తూ సైబరాబాద్ కమిషనర్ అవినాష్ మహంతి మంగళవారం ఉత్తర్వులు జారీ చేశారు. దీంతో బుధవారం ఇన్‌స్పెక్టర్ పవన్‌కుమార్‌రెడ్డి మొయినాబాద్ పోలీస్‌స్టేషన్‌కు వచ్చి బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. శాంతిభద్రతల సమస్యలు రాకుండా చూస్తామన్నారు.

గురుకుల కాంట్రాక్టర్ల బిల్లులు చెల్లించండి



అదనపు కలెక్టర్‌కు వినతిపత్రం అందిస్తున్న అసోసియేషన్ సభ్యులు

కొందుర్గు:గురుకుల పాఠశాల విద్యార్థులకు భోజనం అందిస్తున్న కాంట్రాక్టర్ల బిల్లులు వెంటనే చెల్లించాలని కంట్రాక్టర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో బుధవారం అదనపు కలెక్టర్ భూ పాల్ రెడ్డికి వినతిపత్రం అందజేశారు. ఆరు నెలలుగా బిల్లులు పెండింగ్‌లో ఉన్నాయని.. అప్పులు చేసి విద్యార్థులకు భోజనం అందిస్తున్నామని వినతిపత్రంలో పేర్కొన్నారు. వినతిపత్రం అందించిన వారిలో తెలంగాణ గురుకుల కాంట్రాక్టర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు నర్సింగ్ రావు, ఉపాధ్యక్షుడు దుర్గని శ్రీనివాస్, సెక్రటరీ నల్ల శ్రీనివాసు తదితరులు పాల్గొన్నారు.

ప్లాస్మా వాటర్స్, హార్ట్‌ఫుల్ నెస్‌ల సహకార ఒప్పందం

నందిగామ:యూఎస్ అగ్రి–టెక్ కంపెనీ ప్లాస్మా వాటర్ సొల్యూషన్ ఇంక్, భారతీయ అనుబంధ సంస్థ, ప్రముఖ గ్లోబల్ ఎన్‌జీఓలలో ఒకటైన హార్ట్‌ఫుల్‌నెస్ ఇన్‌స్టిట్యూట్‌తో భాగస్వామ్య ఒప్పందం కుదుర్చుకుంది.రంగారెడ్డి జిల్లా నందిగామ మండలం కాన్హా శాంతి వనంలోని హార్ట్‌ఫుల్‌నెస్ కేంద్రంలో బుధవారం ఇరు సంస్థల ప్రతినిధులు వంశీ చలగుల్లా, రాబర్ట్ హార్ట్ సమక్షంలో ఒప్పందం కుదిరినట్లు హార్ట్‌ఫుల్‌నెస్ సంస్థ పీఆర్‌ఓ చంద్రారెడ్డి తెలిపారు. ఈ మేరకు ఆయన ఓ ప్రకటన విడుదల చేశారు. ఆహార భద్రతను అత్యంత స్థిరమైన పద్ధతిలో ప్రారంభించడం, భారత దేశం నుంచి మిగిలిన ప్రపంచానికి హరిత విప్లవం 2.0ను పరిచయం చేయడం అనే ఉమ్మడి ప్రయోజనాన్ని పోత్రహించడానికి ఈ రెండు సంస్థలు సహకార ఒప్పందంపై సంతకాలు చేసినట్లు ఆ ప్రకటనలో పేర్కొన్నారు. ఈ సందర్భంగా ప్లాస్మా వాటర్ సొల్యూషన్ ఇంక్ ప్రెసిడెంట్, సీఈఓ రాబర్ట్ హార్ట్ మాట్లాడుతూ.. పర్యావరణానికి హాని కలగకుండా మొక్కల ఆరోగ్యం, నేల ఆరోగ్యం, నీటి ఆరోగ్యాన్ని పెంపొందించే పద్ధతుల్లో రైతులకు శిక్షణ ఇవ్వనున్నట్లు తెలిపారు. దీంతో పాటు ఆహార ఉత్పాదకత, రైతుల ఆదాయాన్ని పెంపొందించేందుకు ఈ శిక్షణ ఎంతగానో ఉపయోగపడుతుందని చెప్పారు. కొన్ని నెలలుగా ప్లాస్మా సంస్థ ఆధ్వర్యంలో కాన్హా శాంతి వనంలోని సుమారు 1,700 ఎకరాల్లో పలు బృందాలు విత్తనాలు, వ్యాధులు, మొక్కల ఆరోగ్యంపై వాటర్ ట్రీట్‌మెంట్ ప్రభావాలు పరిశీలిస్తున్నట్లు వెల్లడించారు. బహుళ పంటలు, కూరగాయలు, పండ్లు, ఔషధ మొక్కలు, చెట్లపై ప్లాస్మా వాటర్ స్ప్రేలను ఉపయోగిస్తున్నట్లు తెలిపారు. ఈ రెండు సంస్థలు నీరు, నేల, వాతావరణాన్ని కాపాడేందుకు కృషి చేస్తాయని అన్నారు.

రేపు జేఎన్‌టీయూ స్నాతకోత్సవం

బాలానగర్: జవహర్‌లాల్ సాంకేతిక విశ్వవిద్యాలయంలోని జేఎన్ ఆడిటోరియంలో 12వ స్నాతకోత్సవాన్ని శుక్రవారం నిర్వహించనున్నట్లు ఉపకులపతి కట్టా నరసింహారెడ్డి అన్నారు. బుధవారం ఆయన ఇక్కడ మాట్లాడుతూ.. కార్యక్రమానికి గవర్నర్ తమిళిసై సౌందరరాజన్ ముఖ్య అతిథిగా హాజరు కానున్నారని తెలిపారు. ఇస్రో చైర్మన్ శ్రీధర పణికర్ సోమనాథ్‌కు గౌరవ డాక్టరేట్ అందజేయనున్నట్లు చెప్పారు.

సవాళ్లను అధిగమించేనా?

కొత్త కలెక్టర్‌గా శశాంక నియామకం

- ఉత్తర్వులు జారీ చేసిన ప్రభుత్వం
- ఏడాదిలో నలుగురికి స్థానచలనం
- మరోసారి మార్పుతో చర్చనీయాంశం



సాక్షి, రంగారెడ్డిజిల్లా: నూతన కలెక్టర్‌గా 2013 ఐఏఎస్ బ్యాచ్‌కి చెందిన కె.శశాంక నియమితులయ్యారు. ప్రస్తుతం మహబూబాబాద్ కలెక్టర్‌గా వ్యవహరిస్తున్న ఆయనను రంగారెడ్డి జిల్లాకు బదిలీ చేసింది. ఈ మేరకు బుధవారం ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. గురువారం ఆయన బాధ్యతలు స్వీకరించే అవకాశం ఉంది. ఆయన స్వస్థలం పూర్వ నల్లగొండ జిల్లా గుండాల మండలం పెద్దపడిశాల. మేనమామ సొంతూరైన బుజిలాపురం వద్దే ఉండి మోత్కూరులో టెన్త్ వరకు చదివారు. ఆయన సతీమణి సింధూశర్మ ఐపీఎస్‌గా పని చేస్తున్నారు. ఇదిలా ఉంటే జిల్లాలో కేవలం ఏడాది కాలంలోనే నలుగురు కలెక్టర్లు మారడం చర్చనీయాంశమైంది.

ఒకరి తరువాత ఒకరు..

రెండేళ్లకుపైగా ఇక్కడ కలెక్టర్‌గా పని చేసిన అమయ్ కుమార్ గత ఏడాది ఫిబ్రవరిలో మేడ్చల్‌కు బదిలీపై వెళ్లారు. ఆయన స్థానంలో కలెక్టర్‌గా బాధ్యతలు స్వీకరించిన హరీశ్ కూడా ఇక్కడ ఎక్కువ కాలం కొనసాగలేక పోయారు. అసెంబ్లీ ఎన్నికల నేపథ్యంలో ఆయనపై కేంద్ర ఎన్నికల కమిషన్ బదిలీ వేటు వేసింది. ఆయన స్థానంలో భారతి హోళికేరిని నియమించింది. ఎన్నికలు సజావుగా నిర్వహించి ఎన్నికల కమిషన్‌చే ప్రశంసలు పొందిన ఆమెను ధరణి దరఖాస్తుల క్లియరెన్స్‌లో అజాగ్రత్తగా వ్యవహరించారనే ఆరోపణలపై కొత్తగా అధికారంలోకి వచ్చిన ప్రభుత్వం ఇటీవల జీఏడీకి అటాచ్ చేసింది. అనంతరం ఆమె స్థానంలో మేడ్చల్ కలెక్టర్ గౌతం పొట్రుకు అదనపు బాధ్యతలు అప్పగించింది. తాజాగా ఆయన స్థానంలో మహబూబాబాద్ కలెక్టర్‌గా పని చేస్తున్న కె.శశాంకను నియమించింది. కొత్తగా జిల్లాకు రాబోతున్న ఆయన ముందు అనేక సవాళ్లు లేకపోలేదు.

ఆయన ముందు అనేక సవాళ్లు

తెలంగాణలోనే రంగారెడ్డి జిల్లాకు ప్రత్యేక స్థానం ఉంది. ఔటర్ రింగ్ రోడ్డుతో పాటు అంతర్జాతీయ విమానాశ్రయం ఇక్కడే ఉంది. రాష్ట్రపతి, ప్రధాని సహా అనేక మంది కీలక వ్యక్తులు తరచూ ఇక్కడికి వచ్చి పోతుంటారు. ప్రొటోకాల్ వ్యవహారాలు చూసుకోవాల్సి ఉంటుంది. అంతేకాదు నగరానికి ఆనుకుని జిల్లా ఉండటంతో ఇక్కడ పెట్టుబడులు పెట్టేందుకు అనేక జాతీయ, అంతర్జాతీయ కంపెనీలు ముందుకు వస్తున్నాయి. దీంతో ఇక్కడి భూముల ధరలు ఆకాశాన్నంటాయి. భూముల ధరలు ఒక్కసారిగా పెరగడంతో కబ్జాలు కూడా అదేస్థాయిలో అధికమయ్యాయి. ప్రభుత్వ, భూదాన్, వక్ఫ్, దేవాదాయశాఖ, సీలింగ్, అసైన్డ్ భూములు తరచూ అన్యాక్రాంతం అవుతున్నాయి. విలువైన ఈ భూములను కాపాడాల్సిన బాధ్యత కూడా కలెక్టర్‌పైనే ఉంది. భూరికార్డుల ప్రక్షాళనలో భాగంగా గత ప్రభుత్వం తీసుకొచ్చిన 'ధరణి' పోర్టల్‌లో ఇప్పటికే 35 వేలకుపైగా దరఖాస్తులు పెండింగ్‌లో ఉన్నాయి. వీటిలో వివాదాస్పద భూములకు సంబంధించిన దరఖాస్తులే అధికం. ఈ దరఖాస్తుల పరిశీలనలో ఏమాత్రం అజాగ్రత్తగా ఉన్నా.. ప్రజాగ్రహానికి గురికాక తప్పని పరిస్థితి.

వరుస ఎన్నికలు.. రాజకీయ ఒత్తిళ్లు

మరో నాలుగు నెలల్లో లోక్‌సభాస్థానాలకు ఎన్నికలు రాబోతున్నాయి. అంతేకాదు ఈ నెలాఖరుతో గ్రామ పంచాయతీల గడువు కూడా ముగియనుంది. మున్సిపాలిటీలు, కార్పొరేషన్ల గడువు సైతం దగ్గరపడుతోంది. ఈ ఏడాదంతా వరుస ఎన్నికలే. కొత్త ఓటర్ల నమోదు, కార్డుల జారీ, ఎన్నికల నిర్వహణ కలెక్టర్ ముందున్న అతి పెద్ద సవాల్. ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా తీసుకున్న ఆరు గ్యారంటీల అమలు, ప్రభుత్వ సంక్షేమ పథకాలు లబ్ధిదారులకు అందేలా చూడటం, అదుపు తప్పిన జిల్లా రెవెన్యూ యంత్రాంగాన్ని సరైన గాడిలో పెట్టడం వంటి అంశాలు తలనొప్పిగా మారే అవకాశం లేకపోలేదు. అంతేకాదు వివిధ ప్రభుత్వ, ప్రైవేటు పెట్టుబడి సంస్థలకు భూములను సేకరించి పెట్టడం, రాజకీయ ఒత్తిళ్లను తట్టుకుని నిలబడటం కత్తి మీద సామే.



ఏర్పాట్లను పరిశీలిస్తున్న జిల్లా పరిశ్రమల శాఖ అధికారి రాజేశ్వర్‌రెడ్డి తదితరులు

వికసిత్ యాత్రను జయప్రదం చేయాలి

జిల్లా పరిశ్రమల శాఖ అధికారి రాజేశ్వర్‌రెడ్డి

మహేశ్వరం: మండల పరిధిలోని మాణిక్యమ్మ గూడలో జరగనున్న వికసిత్ భారత్ సంకల్ప యాత్రను విజయవంతం చేయాలని జిల్లా పరిశ్రమల శాఖ అధికారి రాజేశ్వర్‌రెడ్డి పేర్కొన్నారు. అధికారులు, ప్రజా ప్రతినిధులు, గ్రామస్తులతో కలిసి బుధవారం ఏర్పాట్లను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడు తూ.. వికసిత్ భారత్ సంకల్ప యాత్రలో భాగంగా కేంద్ర బొగ్గు గనుల శాఖ మంత్రి ప్రహ్లాద్ జోషి హాజరవుతున్నారన్నారు. కేంద్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా ప్రవేశపెట్టిన పలు పథకాలు, అభివృద్ధి కార్యక్రమాలను ప్రజలకు వివరించనున్నట్లు చెప్పారు. కార్యక్రమంలో 14 శాఖల అధికారులు పాల్గొననున్నారని, ప్రజా ప్రతినిధులు, గ్రామస్తులు అధిక సంఖ్యలో హాజరై విజయవంతం చేయాలని ఆయన కోరారు. కార్యక్రమంలో ఎంపీడీఓ నర్సింహ, ఎంపీఓ రవీందర్‌రెడ్డి, బీజేపీ జిల్లా ప్రధాన కార్యదర్శి, మాజీ వైస్ ఎంపీపీ మిద్దె సుదర్శన్‌రెడ్డి, అమీర్‌పేట్ ఎస్‌బీఐ మేనేజర్ కృష్ణ ప్రసాద్, బీజేపీ మండల అధ్యక్షుడు మాధవాచారి, పంచాయతీ కార్యదర్శి పరమేష్, పలువురు నాయకులు పాల్గొన్నారు.

జిల్లాలో జమ్మికుంట పుర పంచాయితీ



ఫాంహౌస్ వద్ద బీఆర్‌ఎస్, కాంగ్రెస్ నాయకుల వాగ్వాదం

- మున్సిపల్ చైర్మన్‌పై అవిశ్వాసమే కారణం
- బీఆర్‌ఎస్, కాంగ్రెస్ నాయకుల వాగ్వాదం
- స్థానికంగా ఉద్రిక్త వాతావరణం
- పోలీసుల జోక్యంతో సద్దుమణిగిన లొల్లి
- పరస్పరం ఫిర్యాదు చేసుకున్న ఇరువర్గాలు

కొత్తూరు: కరీంనగర్ జిల్లా హుజూరాబాద్ నియోజకవర్గంలోని జమ్మికుంట మున్సిపల్ చైర్మన్‌పై పెట్టిన అవిశ్వాసం షాద్‌నగర్ నియోజకవర్గంలో బుధవారం రాజకీయ గొడవకు దారి తీసింది. బీఆర్‌ఎస్, కాంగ్రెస్ నేతలు తీవ్ర స్థాయిలో వాగ్వాదానికి దిగడం సంచలనంగా మారింది. ఇరు పార్టీల నాయకులు వందలాదిగా కౌన్సిలర్లు ఉన్న ఫాంహౌస్ వద్దకు చేరుకోవడంతో పరిస్థితి ఉద్రిక్తంగా మారింది. పోలీసుల రంగప్రవేశం.. చర్చలతో పరిస్థితి సద్దుమణిగింది. వివరాలివీ.. ప్రస్తుతం జమ్మికుంట మున్సిపల్ చైర్మన్‌గా కొనసాగుతున్న రాజేశ్వర్‌రావుపై ఇటీవల కాంగ్రెస్‌లో చేరిన పొన్నగంటి మల్లయ్య వర్గం అవిశ్వాస తీర్మానం ప్రవేశ పెట్టింది. ఇందులో భాగంగా మల్లయ్య తనకు అనుకూలంగా ఉన్న వారిని మంగళవారం హైదరాబాద్‌కు తీసుకొచ్చి ఓ హోటల్‌లో క్యాంపు కొనసాగిస్తున్నాడు. విషయం తెలుసుకున్న ప్రస్తుత చైర్మన్, అతడి వర్గీయులు క్యాంపు నుంచి ఒక కౌన్సిలర్‌ను బయటకు రప్పించి తమతో తీసుకెళ్లారు. అవిశ్వాస తీర్మానానికి ఇంకా సమయం ఉండడం.. క్యాంపు ప్రాంతాన్ని బీఆర్‌ఎస్ నేతలు తెలుసుకోవడంతో మల్లయ్య వర్గం షాద్‌నగర్ కాంగ్రెస్ నాయకులను సంప్రదించింది. దీంతో కొత్తూరు మాజీ జెడ్పీటీసీ శ్యాంసుందర్‌రెడ్డి ఇన్ముల్‌నర్వ సమీపంలోని వైఎం తండా దగ్గర ఉన్న ఓ ఫాంహౌస్‌లో అదేరాత్రి వారికి బస ఏర్పాటు చేశారు. విషయం తెలుసుకున్న చైర్మన్, అతడి అనుచరులు అర్ధరాత్రి ఫాంహౌస్ వద్దకు వచ్చి గేటు తెరవాలని గొడవ చేయగా వారు మాజీ జెడ్పీటీసీకి సమాచారం ఇచ్చారు. దీంతో శ్యాంసుందర్‌రెడ్డి ఉదయం ఫాంహౌస్ వద్దకు బయలుదేరాడు. దారిలో కార్లు కనిపించడంతో వారిని వివరాలు అడిగే క్రమంలో వాగ్వాదం మొదలైంది. విషయం తెలుసుకున్న షాద్‌నగర్ మాజీ ఎమ్మెల్యే అంజయ్యయాదవ్ కుమారుడు, కేశంపేట ఎంపీపీ రవీందర్‌యాదవ్, కాంగ్రెస్ నాయకులు విడివిడిగా పెద్ద సంఖ్యలో ఫాంహౌస్ వద్దకు చేరుకున్నారు. బీఆర్‌ఎస్ కౌన్సిలర్లను అక్రమంగా తీసుకొచ్చారని ఆరోపిస్తుండగా కాంగ్రెస్ నాయకులు పోలీసుల సమక్షంలో కౌన్సిలర్ల వద్దకు తీసుకెళ్లగా తమ ఇష్టంతోనే క్యాంపుకు వచ్చినట్లు వారు తెలిపారు. ఈ క్రమంలోనే గేటు బయట ఇరువర్గాల నాయకులు తమ వారికి అనుకూలంగా నినాదాలు చేస్తూ నెట్టుకున్నారు. ఇంతలో పోలీసులు జోక్యం చేసుకుని పరిస్థితిని అదుపులోకి తెచ్చారు.

నటన ఆపి, నిజాలు మాట్లాడాలి..

జమ్మికుంట కౌన్సిలర్లు తమ ఇష్టంతోనే ఫాంహౌస్‌కు వచ్చినట్లు మాజీ జెడ్పీటీసీ శ్యాంసుందర్‌రెడ్డి, కాంగ్రెస్ నేతలు రఘు, మల్లయ్య తెలిపారు. ఇవేవీ తెలుసుకోకుండా తాము ప్రస్తుత చైర్మన్ రాజేశ్వర్‌రావును హత్య చేయడానికి సుపారీ తీసుకున్నామని ఆరోపించడం సిగ్గుచేటన్నారు. నిజంగా బీఆర్‌ఎస్ పార్టీ కౌన్సిలర్లను అక్రమంగా తీసుకొస్తే చట్ట ప్రకారం పోలీసులకు ఫిర్యాదు చేసి ఫాంహౌస్‌కు రావాలన్నారు. అంతేతప్ప అర్ధరాత్రి ఫాంహౌస్‌కు వచ్చి ఎందుకు రెక్కీ నిర్వహించారని నిలదీశారు. ఎమ్మెల్యే కౌశిక్‌రెడ్డి, కేశంపేట ఎంపీపీ రవీందర్‌యాదవ్, జమ్మికుంట మున్సిపల్ చైర్మన్ రాజేశ్వర్‌రావు వాస్తవాలు దాచి ప్రజలను, పోలీసులను తప్పుదోవ పట్టిస్తున్నారని అన్నారు.

పోలీసులు చర్యలు తీసుకోవాలి

జమ్మికుంట చైర్మన్‌పై దాడి చేసిన కాంగ్రెస్ నేత శ్యాంసుందర్‌రెడ్డితో పాటు పలువురిపై పోలీసులు వెంటనే చర్యలు తీసుకోవాలని హుజూరాబాద్ ఎమ్మెల్యే కౌశిక్‌రెడ్డి, మున్సిపల్ చైర్మన్ రాజేశ్వర్‌రావుతో పాటు పలువురు కొత్తూరు సీఐ నర్సింహారావుకు ఫిర్యాదు చేశారు. తమ పార్టీ కౌన్సిలర్లను అక్రమంగా తీసుకొచ్చారని ఫిర్యాదులో పేర్కొన్నారు.

చర్లపల్లి టెర్మినల్‌ను సందర్శించిన అధికారులు

కుషాయిగూడ: చర్లపల్లి రైల్వే టెర్మినల్ పనులను బుధవారం రైల్వే, జీహెచ్‌ఎంసీ అధికారుల బృందం పరిశీలించింది. అప్రోచ్ రోడ్ల కోసం స్థల సేకరణ విషయమై రైల్వే డీఆర్‌ఎం భరతేష్ కుమార్ జైన్, ఏడీఆర్‌ఎం రాజీవ్‌కుమార్ ఇంగ్లే, డీఓఎం జనరల్ మణికుమార్ తదితరులు జీహెచ్‌ఎంసీ కమిషనర్ రోనాల్డ్ రాస్‌తో కలిసి సందర్శించారు. ఈసీనగర్ రోడ్డులో మహాలక్ష్మి నగర్ కమాన్‌లోంచి స్టేషన్‌కు వెళ్లేందుకు 30 అడుగులున్న అప్రోచ్ రోడ్డును 80 అడుగులకు పెంచాలని నిర్ణయించారు. నిర్మాణంలో ఉన్న నూతన టెర్మినల్ ప్రధాన అప్రోచ్ రోడ్డు కోసం 100 అడుగుల రోడ్డు మార్గం వేయనున్నారు. ప్రధాన రోడ్డు మార్గం గోకుల్‌నగర్ నుంచి చర్లపల్లి పారిశ్రామికవాడకు వెళ్లే రోడ్డుకు కలపాలని నిర్ణయించారు. అప్రోచ్ రోడ్ల నిర్మాణానికి అవసరమైన స్థలాల సేకరణను యుద్ధప్రాతిపదికన చేపట్టాలని జడ్సీ, కాప్రా డీసీలను ఆదేశించారు. అనంతరం మల్లాపూర్ నోమా కల్యాణ మండపం నుంచి రైల్వేట్రాక్ వరకు ఉన్న బాక్స్‌డ్రైన్ సామర్థ్యాన్ని పెంచాలన్న రైల్వే అధికారుల విన్నపం మేరకు కమిషనర్ రోనాల్డ్ రాస్ బాక్స్ డ్రైన్‌ను పరిశీలించారు.



టెర్మినల్ పనులపై కాంట్రాక్టర్లతో సమీక్షిస్తున్న డీఆర్‌ఎం భరతేష్ కుమార్ జైన్

కళ తప్పిన టౌన్ ప్లానింగ్ ఖజానా

- తగ్గిన భవన అనుమతుల ఫీజులు
- 2022లో రూ.1,056 కోట్లు..
- 2023లో రూ.870 కోట్లు



సాక్షి, సిటీబ్యూరో: జీహెచ్‌ఎంసీకి భవన నిర్మాణ అనుమతుల ఫీజుల ద్వారా వచ్చే ఆదాయం ఇటీవల ముగిసిన 2023 సంవత్సరంలో గణనీయంగా తగ్గింది. గడచిన సంవత్సరాల్లో ఆదాయం పెరుగుతూ పోగా ఈసారి మాత్రం తగ్గింది. అంతకుముందు సంవత్సరం 2022లో జనవరి నుంచి డిసెంబర్ వరకు టౌన్‌ప్లానింగ్ విభాగం ద్వారా జీహెచ్‌ఎంసీ ఖజానాకు భవన నిర్మాణ అనుమతులు, ఆక్యుపెన్సీ సర్టిఫికెట్ల

జారీ తదితరాలతో రూ.1056 కోట్ల ఆదాయం లభించగా, 2023లో మాత్రం రూ.870 కోట్లు మాత్రమే సమకూరినట్లు తెలిసింది. అసెంబ్లీ ఎన్నికల కారణంగానూ నగరంలో నిర్మాణాల సంఖ్య తగ్గిందని భావిస్తున్నారు. ఎన్నికల దృష్ట్యా రాజకీయ పార్టీలకు సహకరించాల్సి రావడంతో బిల్డర్లు నిర్మాణాలపై పూర్తిస్థాయిలో శ్రద్ధ చూపలేదని చెబుతున్నారు.

అనుమతులిలా..

టీఎస్ బీపాస్ ద్వారా భవన నిర్మాణ అనుమతుల్ని సులభతరం చేయడంతో త్వరితగతిన అనుమతులు జారీ అవుతున్నట్లు టౌన్‌ప్లానింగ్ అధికారులు చెబుతున్నారు. తక్కువ స్థలంలో 75 గజాల లోపు విస్తీర్ణంలో నిర్మించే ఇళ్లకు అనుమతులవసరం లేదు. వాటిని రిజిస్ట్రేషన్ చేయించుకుంటే సరిపోతుంది. అలా రిజిస్ట్రేషన్లకు సంబంధించి 2023లో 1828 దరఖాస్తులు రాగా వాటిలో సక్రమంగా ఉన్న 588 దరఖాస్తుల్ని ఇన్‌స్టంట్‌గానే రిజిస్ట్రేషన్ చేశారు. 2022 సంవత్సరంలో అలాంటి దరఖాస్తులు 1921 రాగా, 716 దరఖాస్తులు ఇన్‌స్టంట్‌గా రిజిస్ట్రేషన్ చేశారు.

- 500 చదరపు మీటర్ల విస్తీర్ణంలో, పదిమీటర్ల ఎత్తు వరకు నిర్మించే ఇళ్ల కోసం 2022లో 13,455 దరఖాస్తులు రాగా, వీటిలో 11,088కి ఇన్‌స్టంట్‌గా ఆమోదం తెలిపారు. 2023లో ఇలాంటి భవనాలకు సంబంధించి 11,851 దరఖాస్తులు మాత్రమే రాగా, 9,168 భవనాలను ఇన్‌స్టంట్‌గా ఆమోదించారు. వాటిలో 1765 భవనాలకు నిర్మాణ అనుమతుల్ని తిరస్కరించారు. సింగిల్‌విండో ద్వారా దరఖాస్తుల్ని పరిశీలించే 500 చదరపు మీటర్ల కంటే ఎక్కువ విస్తీర్ణంలో, పది మీటర్ల కంటే ఎక్కువ ఎత్తులో నిర్మించే భవనాలకు 2023లో 4,533 దరఖాస్తులు రాగా, వాటిలో 1995 అనుమతించారు.
- షార్ట్‌ఫాల్స్ ఉన్నందున 1129 భవనాలకు అనుమతులివ్వలేదు. నిబంధనలకు విరుద్ధంగా ఉన్నందున 674 భవనాల అనుమతుల్ని పూర్తిగా తిరస్కరించారు. 2022లో ఇలాంటి భవనాల నిర్మాణాలకు 1920 దరఖాస్తుల్ని మాత్రం ఆమోదించారు. 2023లో ఇన్‌స్టంట్ ఆక్యుపెన్సీ సర్టిఫికెట్ల(ఓసీ) కోసం 1441 దరఖాస్తులు రాగా, దాదాపు 900 దరఖాస్తులకు ఓసీలు జారీ చేశారు. 400 దరఖాస్తులు తిరస్కరించారు. మిగతావి షార్ట్‌ఫాల్స్‌తో పెండింగ్‌లో ఉన్నాయి.

ఆర్థిక సంవత్సరం ముగిసేలోగా..

ఆదాయాన్ని ఆర్థికసంవత్సరం ప్రాతిపదికన లెక్కిస్తామని, ఈ ఆర్థిక సంవత్సరం ముగిసేందుకు ఇంకా మూడు నెలల సమయమున్నందున ఆలోగా భవన నిర్మాణ అనుమతులు, ఫీజుల ద్వారా వచ్చే ఆదాయం పెరగవచ్చని అధికారులు ఆశాభావం వ్యక్తంచేస్తున్నారు.

'పేట'.. మళ్లీ మొదలైంది ఆట!

- పెద్దఅంబర్‌పేట పురపాలికలో తిరిగి తెరపైకి అవిశ్వాసం
- గతేడాదే 15మంది కౌన్సిలర్ల ఫిర్యాదు
- అప్పటి ప్రభుత్వ నిర్ణయం, కోర్టు స్టేతో బ్రేక్
- కొత్త సర్కార్ నిర్ణయంతో మరోసారి కదలిక
- స్థానికంగా చర్చనీయాంశం

అబ్దుల్లాపూర్‌మెట్ : పెద్దఅంబర్‌పేట పురపాలికలో అవిశ్వాస పంచాయితీ మళ్లీ తెరపైకి వచ్చింది. చైర్‌పర్సన్, వైస్‌చైర్‌పర్సన్‌పై అవిశ్వాస నోటీసులు జారీ చేయాలంటూ గతేడాది జనవరి 28న పురపాలికకు చెందిన 15 మంది కౌన్సిలర్లు కలెక్టర్‌తోపాటు పురపాలక సంఘం కమిషనర్‌కు వేర్వేరుగా ఫిర్యాదు చేసిన విషయం తెలిసిందే. పెద్దఅంబర్‌పేటతో పాటు రాష్ట్ర వ్యాప్తంగా పలు కార్పొరేషన్లు, పురపాలక సంఘాల్లో వచ్చిన అవిశ్వాస ఫిర్యాదులపై అప్పటి బీఆర్‌ఎస్ ప్రభుత్వం ఎటూ తేల్చకపోవడం.. కోర్టు స్టే విధించడంతో కొంత గందరగోళ పరిస్థితులు నెలకొన్నాయి. ఇటీవల రాష్ట్రంలో కొత్త ప్రభుత్వం ఏర్పాటు కావడం.. పురపాలక సంఘాల్లో పాలకవర్గాలు కొలువు తీరి నాలుగేళ్లు పూర్తి కానున్న నేపథ్యంలో చైర్మన్, వైస్‌చైర్మన్ల పదవులపై ఇచ్చిన అవిశ్వాస ఫిర్యాదుల్లో కొంత మేర కదలిక వచ్చినట్లు తెలుస్తోంది. పెద్దఅంబర్‌పేట పురపాలక సంఘం పరిధిలో రాజకీయ



కలెక్టర్ కార్యాలయంలో గతేడాది అవిశ్వాసంపై ఫిర్యాదు పత్రం అందిస్తున్న కౌన్సిలర్లు

పరిణామాలు తారుమారు కానున్నాయనే చర్చ మొదలైంది. పెద్దఅంబర్‌పేట పురపాలక సంఘం చైర్‌పర్సన్ చెవుల స్వప్న, వైస్‌చైర్‌పర్సన్ చామ సంపూర్ణపై అవిశ్వాస నోటీసు ప్రవేశపెట్టాలని పురపాలక సంఘానికి చెందిన 15మంది కౌన్సిలర్లు ఫిర్యాదు చేశారు. 15 మంది కౌన్సిలర్లలో బీఆర్‌ఎస్‌తో పాటు కాంగ్రెస్ సభ్యులకు తోడుగా ఇతరులు ముగ్గురు ఉన్న సంగతి తెలిసిందే.

నూతన సంవత్సరం సాకుగా ..

మూడు రోజుల క్రితం నూతన సంవత్సరాన్ని పురస్కరించుకుని పెద్దఅంబర్‌పేటకు చెందిన దాదాపు పది మందికి పైగా కౌన్సిలర్లు సమావేశమైనట్లు తెలుస్తోంది. పేరుకు నూతన సంవత్సరం వేడుకలు అని పేర్కొంటున్నప్పటికీ చైర్‌పర్సన్, వైస్ చైర్‌పర్సన్‌పై అవిశ్వాసం కోసమే ప్రత్యేకంగా సమావేశయ్యారని.. అందుకు తగ్గట్టు ప్రణాళికలు రూపొందించుకున్నట్లు సమాచారం. గతేడాది అవిశ్వాసంపై ఇచ్చిన ఫిర్యాదుల మేరకే జిల్లా అధికారులు నోటీసులు జారీ చేయనున్నారని, మళ్లీ ఫిర్యాదు చేయాల్సిన అవసరం లేదని ప్రభుత్వం నుంచి పరోక్షంగా సంకేతాలు వచ్చాయి. దీంతో చైర్‌పర్సన్, వైస్ చైర్‌పర్సన్ పీఠాలపై కన్నేసిన కౌన్సిలర్లు తమ వర్గానికి చెందిన కౌన్సిలర్లతో టచ్‌లో ఉంటున్నట్లు చర్చ జరుగుతోంది. పాలకవర్గం ఏర్పడి నాలుగేళ్లకు రోజులు దగ్గర పడుతున్న కొద్దీ పురపాలికలో రాజకీయం వేడెక్కుతోంది.

సీసీ కెమెరాలతో నేరాలకు చెక్

రాజేంద్రనగర్ డీసీపీ జగదీశ్వర్‌రెడ్డి

శంకర్‌పల్లి: సీసీ కెమెరాలతో దొంగతనాల నివారణతో పాటు క్రైం రేటును తగ్గించుకోవచ్చని రాజేంద్రనగర్ డీసీపీ జగదీశ్వర్‌రెడ్డి పేర్కొన్నారు. రూ.20లక్షలతో శంకర్‌పల్లి పోలీస్ స్టేషన్ పరిధిలో ఏర్పాటు చేసిన సీసీ కెమెరాలను బుధవారం ఆయన ప్రారంభించారు. దాతల సహకారంతో రూ.20 లక్షలతో సీసీ కెమెరాల ఏర్పాటుకు కృషి చేసిన శంకర్‌పల్లి సీఐ వినాయకరెడ్డిని అభినందించారు. అనంతరం డీసీపీ మాట్లాడుతూ.. ఒక్క సీసీ కెమెరా 100 మంది వ్యక్తులతో సమానం అన్నారు. సీసీ కెమెరాలు దొంగతనాలను నివారించడంతోపాటు చైన్ స్నాచింగ్, యాక్సిడెంట్ చేసి ఆగకుండా పారిపోయిన వాహనదారులను గుర్తించేందుకు ఎంతో దోహదపడతాయని తెలిపారు. అన్ని కాలనీల్లో సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో రాజేంద్రనగర్ అడిషనల్ డీసీపీ సాధన రష్మి పెరుమాళ్, నార్సింగి ఏసీపీ లక్ష్మీనారాయణ, శంకర్‌పల్లి సీఐ వినాయకరెడ్డి, మోకిల ఇన్‌చార్జి సీఐ నాగరాజు, ఎస్‌ఐ సంతోష్‌రెడ్డి, డిటెక్టివ్ ఎస్‌ఐ సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న డీసీపీ జగదీశ్వర్‌రెడ్డి

అర్హులు దరఖాస్తు చేసుకోవాలి



మాట్లాడుతున్న అదనపు కలెక్టర్ ప్రతిమసింగ్

అదనపు కలెక్టర్ ప్రతిమ సింగ్

మంచాల: అర్హులందరూ ప్రజాపాలనలో అభయ హస్తం దరఖాస్తులు చేసుకోవాలని జిల్లా అదనపు కలెక్టర్ ప్రతిమసింగ్ అన్నారు. బుధవారం ఇబ్రహీంపట్నం మండలంలోని కప్పాడు, ముకునూర్, ఇబ్రహీంపట్నం మున్సిపాలిటీలో కొనసాగుతున్న ప్రజాపాలన కార్యక్రమాలను ఆయన పరిశీలించారు. ప్రజల సౌకర్యార్థం కోసం ఎన్ని కౌంటర్లు ఏర్పాటు చేశారు. దరఖాస్తుల స్వీకరణ ఎలా చేస్తున్నారు, దరఖాస్తులను ప్రజలకు అందుబాటులో ఉంచారా, దరఖాస్తులు నింపేందుకు వలంటీర్లు, సిబ్బంది ప్రజలకు సహకారం అందిస్తున్నారా అని అధికారులను అడిగి తెలుసుకున్నారు. అదే విధంగా రిజిస్టర్ నమోదు వంటి అంశాలను కూడా పరిశీలించారు. రేషన్‌కార్డు లేనివారు కూడా దరఖాస్తు చేసుకోవాలని తెలిపారు.

అనుమతులు రద్దుచేయండి

కప్పాడు గ్రామసభకు వచ్చిన అదనపు కలెక్టర్ ప్రతిమ సింగ్‌ను గ్రామ పంచాయతీ పాలక వర్గం, రైతులు కలిసి.. ఎల్మినేడ్ రెవెన్యూ పరిధిలో ఏర్పాటు చేస్తున్న రైస్‌మిల్లు అనుమతులు అడ్డుకోవాలని కోరారు. మొదట్లో రైస్ గోదాం ఏర్పాటు చేస్తామని నమ్మించి రైస్‌మిల్లు ఏర్పాటు చేయడం జరుగుతుందన్నారు. రైస్‌మిల్లు ఏర్పాటుతో వచ్చే వ్యర్థాలతో ప్రజల ఆరోగ్యం దెబ్బతినడమే గాకుండా పక్కనే గల చెరువు కలుషితమవుతుందన్నారు. ఈమేరకు వినతిపత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ కృపేశ్, ఎంపీటీసీ సభ్యుల ఫోరం మండల అధ్యక్షుడు భరత్‌రెడ్డి, సర్పంచ్ హంసమ్మ, ఉపసర్పంచ్ మునీర్, ఇబ్రహీంపట్నం మున్సిపల్ చైర్‌పర్సన్ స్రవంతి, వైస్ చైర్మన్ యాదగిరి, కౌన్సిలర్లు శ్వేత, వార్డుసభ్యులు, అధికారులు పాల్గొన్నారు.

అక్రమ వెంచర్ కూల్చివేత



హిమాయత్‌నగర్‌లో అనుమతులు లేని నిర్మాణాన్ని కూల్చివేసిన అధికారులు

మొయినాబాద్‌రూరల్: అక్రమంగా వెంచర్ నిర్మాణాలు చేపడితే చర్యలు తప్పవని ఎంపీఓ వెంకటేశ్వరరెడ్డి, హిమాయత్‌నగర్ గ్రామ పంచాయతీ కార్యదర్శి సంధ్యారాణి పేర్కొన్నారు. బుధవారం హిమాయత్‌నగర్ సమీపంలో గల సర్వే నంబర్ 145లో అక్రమ వెంచర్ నిర్మాణాలు జీవో 111కు విరుద్ధంగా చేపడుతున్న వాటిని జేసీబీతో కూల్చివేశారు. ఈ సందర్భంగా అధికారులు మాట్లాడుతూ.. హిమాయత్‌నగర్ చౌరస్తా సమీపంలో ఉన్న ఈ వెంచర్‌కు గతంలో రెండుసార్లు నోటీసులు ఇచ్చామన్నారు. అయినా తమ మాటలను బేఖాతరు చేస్తూ పనులు సాగిస్తుండగా కూల్చివేశామన్నారు. మళ్లీ పనులు నిర్వహిస్తే కేసులు పెడతామని హెచ్చరించారు. అక్రమ నిర్మాణాలను సహించేదిలేదన్నారు.

అప్‌డేట్ అవస్థలు

కిటకిటలాడుతున్న ఆధార్ కేంద్రాలు

- పదేళ్లకోసారి అప్‌డేట్ చేసుకోవాలంటున్న కేంద్రం
- ప్రభుత్వ పథకాలకూ తప్పనిసరి అంటున్న అధికారులు
- సెంటర్లు పెంచాలంటున్న ప్రజలు



షాద్‌నగర్‌లో ఆధార్ సెంటర్ వద్ద క్యూలైన్



కేంద్రం బయట క్యూలైన్‌లో చెప్పులు పెట్టిన దృశ్యం

కొందుర్గు: దేశంలోని ప్రతి వ్యక్తికి ఆధార్‌కార్డు తప్పనిసరిగా మారింది. ప్రభుత్వం ఏ పథకం ప్రారంభించినా ఆధార్‌కార్డును అనుసంధానం చేయాల్సిన పరిస్థితి నెలకొంది. పాఠశాలలో విద్యార్థిని చేర్పించాలన్నా, విద్యార్థికి ఉపకారవేతనం కోసం దరఖాస్తు చేసుకోవాలన్నా, రైతులకు పంట రుణాలు, రైతుబంధు అందుకోవాలన్నా, మహిళలు పొదుపు సంఘాల్లో చేరాలన్నా, ప్రభుత్వం కల్పించిన ఉచిత బస్సు ప్రయాణం చేయాలన్నా, వృద్ధులు పింఛన్ పొందాలన్నా.. ఇలా పుట్టిన శిశువు మొదలు వ్యక్తి జీవితాంతం, చివరకు మరణించిన అనంతరం మరణ ధృవపత్రం పొందాలన్నా ఆధార్ తప్పనిసరిగా మారింది. ఇంత ప్రాముఖ్యత గల ఆధార్ కార్డు కేంద్రాలు జిల్లాలోని అన్ని మండలాల్లో, ప్రధాన పట్టణాల్లో లేకపోవడంతో ప్రజలు ఇక్కట్లు పడుతున్నారు.

అప్‌డేట్ చేయాల్సిందే..

పుట్టిన శిశువుకు ఆధార్‌కార్డు తీసుకున్న అనంతరం ఐదేళ్ల తదుపరి ఆధార్ అప్‌డేట్ చేయాలి. అదేవిధంగా ప్రతి పదేళ్లకోసారి ఆధార్ అప్‌డేట్ చేస్తేనే వేలిముద్రలు సరిపోయి ఆధార్ ఐడెంటిఫికేషన్ సునాయాసంగా ఉంటుంది. ఆధార్‌లో ఏదైనా మార్పిడి చేయాలన్నా, ఫోన్‌నంబర్ జతచేయాలన్నా, మహిళలు అయితే తండ్రి పేరు స్థానంలో భర్తపేరు చేర్చాలన్నా ఆధార్ అప్‌డేట్ చేయాల్సిందే. ఇక తెలంగాణ రాష్ట్రం ఏర్పాటుకావడం, జిల్లాలు, మండలాలు, నూతన గ్రామపంచాయతీలు ఏర్పడిన అనంతరం రాష్ట్రంలో ప్రతి వ్యక్తి ఆధార్‌కార్డు అప్‌డేట్ చేసుకోవాల్సిన పరిస్థితి ఏర్పడింది. తాజాగా కాంగ్రెస్ ప్రభుత్వం అభయహస్తం దరఖాస్తులను తీసుకుంటున్న నేపథ్యంలో ఆధార్ అప్‌డేట్ లేకపోతే తమకు పథకాలు అందవేమో అని ప్రతిఒక్కరూ ఆధార్ అప్‌డేట్ కోసం సెంటర్ల వద్ద పడిగాపులు కాస్తున్నారు.

అర్ధరాత్రి నుంచే క్యూలైన్..

షాద్‌నగర్ ఆధార్ సెంటర్ వద్ద అర్ధరాత్రి నుంచే ప్రజలు పడిగాపులు కాస్తున్నారు. రాత్రి సమయంలో క్యూలైన్‌లో చెప్పులు పెట్టి తెల్లవారగానే క్యూలో నిలబడుతున్నారు. గంటలతరబడి లైన్‌లో ఉండి ఆధార్ అప్‌డేట్ చేసుకుంటున్నారు. కొందుర్గు మండలంలో ఒక్క ఆధార్ సెంటర్ కూడా లేకపోవడంతో మండలవాసులు షాద్‌నగర్, చించోడ్‌తోపాటు వికారాబాద్ జిల్లా పరిగి, చిట్యాలకు వెళ్తున్నారు. అక్కడ వెళ్లి గంటల తరబడి నిలబడినప్పటికీ ఏదైన సాంకేతిక లోపం ఏర్పడితే ఆధార్ అప్‌డేట్ కాకపోవడంతో మళ్లీ వెళ్లాల్సిన దుస్థితి ఏర్పడిందని వాపోతున్నారు. ప్రభుత్వం ప్రతి మండలంలో జనాభా ప్రాతిపదికన రెండు నుంచి ఐదు ఆధార్ సెంటర్లు ఏర్పాటుచేయాలని కోరుతున్నారు.

గంటల తరబడి లైన్‌లో..



కొందుర్గు మండలంలో కనీసం ఒక్క ఆధార్ సెంటర్ కూడా లేకపోవడంతో చాలా ఇబ్బందులు పడుతున్నాం. అప్‌డేట్ కోసం ఇంటినుంచి పొద్దుగాలే లేచి షాద్‌నగర్‌కు వెళ్తున్నాం. మేము అక్కడికి వెళ్లేసరికి పెద్ద సంఖ్యలో లైన్‌లో ఉంటున్నారు. గంటల తరబడి లైన్‌లో నిలబడి ఇంటికి వస్తున్నాం. నాలుగైదు గ్రామాలకు ఒక ఆధార్ సెంటర్ ఏర్పాటు చేయాలి.

– వెంకటయ్య, చుక్కమెట్టు, కొందుర్గు

ఎందుకింత నిర్లక్ష్యం



ప్రజలు ఆధార్ సెంటర్ల వద్ద అవస్థలు పడుతున్నా ప్రభుత్వం పట్టించుకోవడం లేదు. ప్రజలు పనులు మానుకొని ఆధార్ సెంటర్ల వద్ద అర్ధరాత్రి నుంచే క్యూలైన్‌లో నిలబడాల్సిన పరిస్థితి నెలకొంది. ప్రతి ఐదువేల జనాభాకు ఒక ఆధార్ సెంటర్ ఏర్పాటుచేయాలి. ఆధార్ సెంటర్లు ఏర్పాటుచేయడం వల్ల ప్రజలకు ఇబ్బందులు తొలగడంతో పాటు యువతకు ఉపాధి లభిస్తుంది.

– జంగయ్య, సీపీఐ నాయకుడు, కొందుర్గు

వ్యక్తి అదృశ్యం



రాజేందర్ (ఫైల్)

కడ్తాల్: మైసిగండికి చెందిన ఓ వ్యక్తి అదృశ్యమైన సంఘటన బుధవారం వెలుగు చూసింది. సీఐ శివప్రసాద్ తెలిపిన వివరాలు.. కడ్తాల్ మండలం మైసిగండికి చెందిన రాజేందర్ (33) గ్రామంలో కిరాణ కొట్టు నడపుతూ జీవనోపాధి పొందుతున్నాడు. గత డిసెంబర్ 19న ఇంట్లో ఎవరికీ చెప్పకుండా బయటికి వెళ్లిపోయాడు. ఎంతకీ తిరిగిరాకపోవడంతో కుటుంబ సభ్యులు రాజేందర్ ఆచూకీ కోసం బంధువుల ఇళ్లలో, సమీప గ్రామాల్లో వెతికినా ఎటువంటి ఫలితం లేదు. దీంతో బుధవారం రాజేందర్ భార్య నీల కడ్తాల్ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేసింది. కేసు నమోదు చేసి చేసి దర్యాప్తు చేస్తున్నామని సీఐ తెలిపారు.

ఉరేసుకొని రైతు ఆత్మహత్య



మహేష్‌కుమార్ (ఫైల్)

షాబాద్: ఆస్తి పంపకం విషయంలో తల్లితో గొడవపడిన ఓ రైతు ఆత్మహత్య చేస్తుకున్నాడు . ఎస్ఐ మహేశ్వర్‌రెడ్డి తెలిపిన వివరాలు.. గ్రామానికి చెందిన మహేష్‌కుమార్(35)కు మంగళవారం తల్లితో ఆస్తి పంపకం విషయంలో తీవ్ర ఘర్షణ జరిగింది. దీంతో మనస్తాపానికి గురైన అతడు బుధవారం తన పొలంలో వేపచెట్టుకు ఉరి వేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడు. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

గడువు పెంపు

రాయదుర్గం: మనూలో దూరవిద్య కోర్సుల రిజిస్ట్రేషన్ గడువును పొడిగించడం జరిగిందని డైరెక్టరేట్ ఆఫ్ డిస్టెన్స్ ఎడ్యుకేషన్(డీడీఈ) డైరెక్టర్ ప్రొఫెసర్ మహ్మద్ రజావుల్లాఖాన్ బుధవారం తెలిపారు. దూర విద్యాకోర్సులలో అండర్ గ్రాడ్యుయేట్, గ్రాడ్యుయేట్ కోర్సుల కోసం పోర్టల్ ద్వారా రిజిస్ట్రేషన్ చేసుకునేందుకు జనవరి 10వ తేదీ వరకు అవకాశం ఉందని తెలిపారు. మరిన్ని వివరాలకోసం 'మనూ' వెబ్‌సైట్‌ను చూడాలని ఆయన కోరారు.

అమ్మవారి ఆభరణాలు చోరీ

శంషాబాద్ రూరల్: పొలంలో ఉన్న ఆలయంలోని దేవతామూర్తి ఆభరణాలను గుర్తు తెలియని వ్యక్తులు ఎత్తుకెళ్లారు. ఇన్‌స్పెక్టర్ ఏ. శ్రీధర్‌కుమార్ తెలిపిన వివరాల ప్రకారం.. మండలంలోని బహదూర్‌గూడకు చెందిన ఏనుగు బుచ్చిరెడ్డి పొలంలో మైసమ్మ దేవాలయం ఉంది. ఈ ఆలయంలోని అమ్మవారి విగ్రహానికి ఆభరణాలు ఉన్నాయి. అయితే మంగళవారం రాత్రి గుర్తు తెలియని వ్యక్తులు దేవతామూర్తిపై ఉన్న రెండు గ్రాముల బంగారం, 20 తులాల వెండి నగలు ఎత్తుకెళ్లారు. బుధవారం ఉదయం గమనించిన రైతు పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నమన్నారు.

తాళంవేసిన ఇంట్లో చోరీ

శంషాబాద్ రూరల్: రాత్రి వేళ ఇంటి తలుపులు విరగొట్టి బీరువాలోని బంగారు, వెండి నగలు దొంగిలించిన ఘటన ఊట్‌పల్లిలో చోటు చేసుకుంది. ఇన్‌స్పెక్టర్ ఏ. శ్రీధర్‌కుమార్ తెలిపిన వివరాల ప్రకారం.. శంషాబాద్ మున్సిపాలిటి పరిధిలోని ఊట్‌పల్లిలో నివాసముండే నవీన్‌కుమార్ ఈ నెల 2న కిస్మత్‌పూర్‌లోని అత్తగారింటికి వెళ్లాడు. ఇంట్లో ఉన్న ఇతని అన్న నర్సింహాచారి.. అదే రోజు రాత్రి ఇంటికి తాళం వేసి పైకప్పు అంతస్తులో ఉన్న తన బెడ్‌రూంలో నిద్రపోయాడు. ఉదయం వచ్చి చూడగా తలుపులు తెరిచి ఉన్నాయి. గుర్తు తెలియని వ్యక్తులు ఇంట్లోకి చొరబడి బీరువాలో 2 తులాల బంగారం, 20 తులాల వెండి, నగదును దోచుకెళ్లారన్నారు. బుధవారం బాధితుడి ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నమన్నారు.

వంద రోజులు వేచి చూద్దాం: ఎమ్మెల్యే

శంషాబాద్ రూరల్: కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల హామీలో ఇచ్చిన ఆరు గ్యారంటీల అమలుకు వంద రోజుల వరకు వేచి చూద్దాం.. అప్పటి వరకు ప్రభుత్వాన్ని విమర్శించాల్సిన అవసరం లేదని రాజేంద్రనగర్ ఎమ్మెల్యే ప్రకాష్‌గౌడ్ అన్నారు. బుధవారం మండలంలోని ననాజీపూర్‌లో నిర్వహించిన ప్రజా పాలన కార్యక్రమానికి ఆయన హాజరయ్యారు. ప్రభుత్వం ప్రజలకు మేలు చేస్తే స్వాగతిస్తామన్నారు. ఆరు గ్యారంటీల అమలుకు ఇంకా రెండు నెలల సమయం ఉందని.. అప్పటి వరకు వేచి చూద్దామన్నారు. అమలు చేయని పక్షంలో పోరాటం చేస్తామన్నారు. ప్రభుత్వంలో ఉన్నా లేకున్నా ప్రజల సంక్షేమం కోసం నాయకులు కృషి చేయాలన్నారు. ఇచ్చిన హామీలు నెరవేర్చాలన్నారు. సర్పంచ్ కల్పన, ఎంపీపీ జయమ్మ, జెడ్పీటీసీ తన్వీ, వైస్ ఎంపీపీ నీలం, సొసైటీ చైర్మన్ సతీష్, ఎంపీడీఓ వసంతలక్ష్మీ, ఎంపీఓ ఉషాకిరణ్ పాల్గొన్నారు.

కార్గో రూట్‌లో మెట్రో రైలు

- డీపీఆర్‌ను సిద్ధం చేయాలని సీఎం ఆదేశం
- హర్షం వ్యక్తం చేస్తున్న జల్‌పల్లి, మామిడిపల్లి వాసులు



మామిడిపల్లి నుంచి విమానాశ్రయానికి కొనసాగుతున్న రహదారి పనులు

మహేశ్వరం: మెట్రో రైలును శంషాబాద్ అంతర్జాతీయ విమానాశ్రయం వరకు విస్తరించడానికి ప్రభుత్వం మొగ్గు చూపుతుండడంతో ఈ ప్రాంతవాసులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. మెట్రో రైలు రెండో దశ విస్తరణలో భాగంగా మంగళవారం నిర్వహించిన సమీక్షా సమావేశంలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి జల్‌పల్లి-మామిడిపల్లి కార్గో రోడ్డులో కొత్త అలైన్‌మెంట్ విషయమై ప్రత్యేకంగా చర్చించిన విషయం తెలిసిందే. గత ప్రభుత్వ హయాంలోనే ఈ రూట్‌లో మెట్రో రైలు కారిడార్‌పై చర్చ జరిగినప్పటికీ.. అది ముందుకు సాగలేదు. ప్రస్తుతం పాతబస్తీలో ఎంజీబీఎస్ నుంచి ఫలక్‌నుమా వరకు కారిడార్‌ను పూర్తి చేసేందుకు ముఖ్యమంత్రి పట్టుదలతో ఉండడం.. దీనికి అనుసంధానంగా ఫలక్‌నుమా నుంచి చాంద్రాయణగుట్ట, బండ్లగూడ, మైలార్‌దేవ్‌పల్లి మీదుగా పి-7 కార్గో రోడ్డులో లక్ష్మీగూడ, వాంబేకాలనీ, జల్‌పల్లి, మామిడిపల్లి మీదుగా 23 కిలోమీటర్ల పొడవులో ఈ లైన్‌కు సంబంధించిన డీపీఆర్‌ను సిద్ధం చేయాలని మెట్రో రైలు ఎండీ ఎన్వీఎస్ రెడ్డిని సీఎం రేవంత్‌రెడ్డి ఆదేశించడంతో తమ ప్రాంతానికి మహర్దశ పట్టనుందన్న అభిప్రాయం స్థానికుల్లో వ్యక్తమవుతోంది.

అనువుగా రోడ్డు

మైలార్‌దేవ్‌పల్లిలోని ఒరంగడ్డ నుంచి మామిడిపల్లి వరకు 150 ఫీట్ల విస్తీర్ణంలో పి-7 కార్గో రోడ్డు నిర్మాణమై ఉంది. రోడ్డు మధ్యలో ఏకంగా 50 ఫీట్ల కంటే అధికంగా డివైడర్ ఉండడంతో అదనంగా స్థల సేకరణ అవసరం లేనందున మెట్రో నిర్మాణానికి ఖర్చు సైతం తక్కువ అవుతుందన్న ఆలోచనతో ప్రభుత్వం ఈ రూట్‌కు ప్రాధాన్యం ఇస్తుంది. విమానాశ్రయానికి వెళ్లే వాహనదారులు, గూడ్స్ వాహనాలు ట్రాఫిక్ సమస్య లేకుండా సులభంగా చేరుకోవాలన్న ఉద్దేశంతో దివంగత ముఖ్యమంత్రి డాక్టర్ వై.ఎస్.రాజశేఖర్‌రెడ్డి 2007లో పి-7 కార్గో రోడ్డు నిర్మాణ పనులను ప్రారంభించారు. 150 ఫీట్ల విస్తీర్ణంలో ప్రారంభమైన పనులు అప్పట్లోనే మామిడిపల్లి వరకు పూర్తయ్యాయి. తాజాగా మామిడిపల్లి వివేకానంద విగ్రహం నుంచి రూ.29.50 కోట్ల వ్యయంతో సీఐఎస్ఎఫ్ క్వార్టర్స్ పక్కనున్న నాగలక్ష్మమ్మ కంచె మీదుగా విమానాశ్రయం వరకు కొనసాగుతున్న పనులు తుది దశకు చేరుకున్నాయి.

వెలుస్తున్న వెంచర్లు

మైలార్‌దేవ్‌పల్లి నుంచి మామిడిపల్లి వరకు ఇప్పటికే పెద్ద ఎత్తున విల్లాలు, గేటెడ్ కమ్యూనిటీ నివాసాలు, అపార్ట్‌మెంట్లు నిర్మాణాలు రూపుదాల్చుకుంటున్నాయి. ఐరా, కాసాగ్రాండ్, ఫినిక్స్, శ్రీనిధి, ప్రిస్టేజీ లాంటి జాతీయ, అంతర్జాతీయ స్థాయి నిర్మాణ సంస్థలు ఈ రహదారికిరువైపులా భారీ వెంచర్లలో నిర్మాణాలు చేపట్టాయి. వీటితో పాటు మామిడిపల్లి కొండలలో పెద్ద ఎత్తున ఐటీ కంపెనీలు కూడా కొలువుదీరుతున్నాయి. ఇలాంటి తరుణంలో ఈ రూట్‌లో మెట్రో రైలు వచ్చినట్లయితే ఇక్కడి వాసులకు రవాణా సదుపాయం ఎంతో వెసులుబాటుగా మారనుంది. ఈ ప్రాంతంతో ఎంతో అనుబంధంగా ఉన్న పాతబస్తీకి వాణిజ్య, సందర్శనీయ అవసరాలకు వెళ్లే ప్రజలకు కూడా మెట్రో సౌకర్యవంతంగా మారే అవకాశాలున్నాయి. పరిసర ప్రాంతాలు కూడా అభివృద్ధి చెందుతాయి.

ప్రయాణం సులభతరం



శంషాబాద్ విమానాశ్రయానికి మామిడిపల్లి, జల్‌పల్లి మీదుగా మెట్రో రైలు నిర్మాణానికి ప్రభుత్వం మొగ్గు చూపడం ఎంతో సంతోషకరం. విమానాశ్రయాన్ని ఆనుకొని ఉన్న తమ గ్రామ ప్రజలు ఇకపై నగరానికి చేరుకోవాలంటే సులభతరం కానుంది. ఒకప్పుడు విమానాశ్రయ నిర్మాణం కోసం భూములిచ్చిన రైతులకు.. మెట్రోలాంటి సదుపాయాలతో ఈ ప్రాంతం అభివృద్ధి చెందితే మరిన్ని ఉపాధి అవకాశాలు ఏర్పడనున్నాయి.

– ఎడ్ల వాసుదేవారెడ్డి, మామిడిపల్లి

చదువుల తల్లికి ఘన నివాళి



సావిత్రి బాయి పూలే విగ్రహానికి నివాళులర్పిస్తున్న ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్, నేతలు

- ఘనంగా సావిత్రి బాయి జయంతి
- నివాళులర్పించిన ఎమ్మెల్యే,నేతలు

షాద్‌నగర్: చదువుల తల్లి సావిత్రి బాయి పూలే అని ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ అన్నారు. బుధవారం ఆమె జయంతిని షాద్‌నగర్ పట్టణంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా మండల పరిషత్ కార్యాలయం ఎదుట ఉన్న పూలే దంపతుల విగ్రహాలకు ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్, మాజీ ఎమ్మెల్యే చౌలపల్లి ప్రతాప్‌రెడ్డిలు పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ.. అట్టడుగు వర్గాల జీవితాల్లో విజ్ఞానాన్ని నింపడానికి సర్వస్వం త్యాగం చేసిన దంపతులు జ్యోతిరావు పూలే, సావిత్రిబాయి పూలే అన్నారు. వారి విశేష కృషి వల్లనే సమాజంలో ప్రతి ఒక్కరు అక్షరాలు నేర్చుకోగలుగుతున్నారన్నారు. భర్త అడుగు జాడల్లో నడిచి సమాజంలో జరుగుతున్న అణిచివేతలను ఎదురించిన ధీశాలి సావిత్రి బాయి అన్నారు. మానవ హక్కులతో పాటుగా ఇతర సామాజిక సమస్యలపై మహిళలను చైతన్యం చేసేందుకు మహిళా సేవా మండలిని స్థాపించిందన్నారు. ఆమె ఆశయాల సాధన కోసం అందరు కృషి చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ ఖాజా ఇద్రీస్, జెడ్పీటీసీ వెంకట్‌రాంరెడ్డి, బాబర్‌ఖాన్, తిరుపతిరెడ్డి, శ్రీనివాస్‌యాదవ్, పురుషోత్తంరెడ్డి, భార్గవ్‌కుమార్, మధుసూధన్‌రెడ్డి, రవి, ఖదీర్, వెంకటేష్‌గౌడ్, సీతారాం, అశోక్ తదితరులు పాల్గొన్నారు.

మాకు న్యాయం చేయండి

భర్త ఇంటి ఎదుట భార్య, కొడుకు నిరసన

మంచాల: తమకు న్యాయం చేయాలని ఓ తల్లి,కొడుకు తండ్రి ఇంటి ఎదుట నిరసనకు దిగిన సంఘటన మంచాల మండల పరిధిలోని జాపాలలో బుధవారం చోటు చేసుకుంది. బాధితుడు వంశీ కథనం ప్రకారం.. ఇరవై ఏళ్ల క్రితం జాపాలకి చెందిన నోముల కృష్ణ అనే వ్యక్తి మాఅమ్మ (మంగమ్మ)ను వివాహం చేసుకున్నాడు. వివాహానంతరం గొడవపడి దూరంగా ఉన్నారు. నాకు ఇరవై సంవత్సరాల వయసొచ్చింది. మా అమ్మ అనారోగ్యానికి గురైంది. ఇప్పుడు మా నాన్న కృష్ణ వేరొక మహిళను పెళ్లిచేసుకొని మాకు తీరని అన్యాయం చేశాడు. వంశీకి మద్దతుగా వారి అమ్మమ్మ కుటుంబ సభ్యులు నిలిచారు. ఉదయం నుంచి సాయంత్రం వరకు కృష్ణ ఇంటిముందు నిరసన వ్యక్తం చేశారు. కృష్ణ, మంగ వివాహానికి సంబంధించిన కేసు ఇంకా కోర్టులో నడుస్తోంది. ఇదే విషయంపై ఇరువురు పోలీసులకు ఫిర్యాదు చేసినట్లు సమాచారం.



కృష్ణ ఇంటి ఎదుట నిరసన తెలుపుతున్న మంగ, వంశీ తదితరులు

సాక్షి క్లాసిఫైడ్స్

Real Estate

■ 1157/-కే గజం నారాయణ్‌ఖేడ్ దగ్గర న్యూవెంచర్ లో 303, 605 గII సైజు గల ప్లాట్లు అమ్మబడును, క్లియర్ టైటిల్ స్పాట్ రిజిస్ట్రేషన్ ఫోన్: 8309376230 [H-787767]

FARM PLOT FOR SALE

■ ఆస్తిపరులు అంటే భూమి ఉన్నవారు ఫార్మ్ ల్యాండ్ DTCP, HMDA, 1లక్ష నుండి 6లక్షల వరకు 121 చ॥గII నుండి 150 గజాల వరకు ఓపెన్ ప్లాట్స్ అమ్మకానికి కలవు. GNR ఇన్‌ఫ్రా 9059405607 [H-788263]

PLOT FOR SALE

■ HMDA & RERA కొంగరకలాన్ – ఫాక్స్‌కాన్, కలెక్టరేట్ TCS, ఆదిభట్ల ORR, దగ్గర కమర్షియల్, విల్లా ఓపెన్ ప్లాట్స్ కలవు & ఏజెంట్స్ కావలెను. ఫోన్: 8008299988. [HA-1033]

■ రూ.495 కే గజం నిమ్స్ & ఇండస్ట్రియల్ కారిడార్‌కు చేరువలో నేషనల్ హైవేకు 2 కి.మీ స్పాట్ రిజిస్ట్రేషన్ మరియు కోట్లలో ఆదాయం సంప్ర: 9059862969. [HA-10996]

■ కేవలం 2,699/– కే చ.గజం యాదాద్రి టెంపుల్ Nr. నెమల, 3,499/–కే చ. గజం విజయవాడ హైవే Nr. టోల్‌ప్లాజా లిమిటెడ్ ప్లాట్స్ కలవు. ఫోన్: 7842408719. [HA-9974]

Services

FOR SALE

■ Running 2300 Sft, Restaurant For Sale at Manikonda, Beside IOCL PetrolPump, Puppalaguda Rd. 60 Seating Fine Dining. 9618696081. [H-793575]

BUSINESS SERVICE

BUSINESS OFFER

■ ఇంటి నుండి 100 రకాల ఉత్పత్తులతో రోజు సంపాదన. LED's, TV's, AC's, Mobiles కొత్తవి కొన/అమ్మబడును. EMI, Credit Cardలో బ్యాలెన్స్ ఉన్నవారికి Spot పర్సనల్/ బిజినెస్ ఫైనాన్స్ సలహాలకై సంప్ర: 9100729447. [HA-3546]

■ ద్వారకా ఎంటర్‌ప్రైజెస్: పేపర్ ప్లేట్స్ & LED మెషిన్స్‌పై ప్రతినెల అధిక ఆదాయం, అద్భుత అవకాశం, ఉచిత ముడి పదార్థాలు, 100% తిరిగి కొనుగోలు ఒప్పందం.9310515624,8800496710. [H-42904]

PERSONAL CARE

CHANGE OF NAME

■ I, SUNKISETTY MANASA PRIYANKA D/o Sunkisetty Pandu Rangaiah R/o Plot no: 122, 1st Foor, Road No:9, Ram Naresh Nagar, HyderNagar Kukatpally, Hyd-500085 has changed my name as SURISETTY PRIYANKA, for all purposes [H-801559]

■ I, Prabhakar Hegde, R/o 301, Samhitha Arcade, Road No.6, Vijaya nagar Colony, Kukatpally, Hyderabad - 500072, have changed the name to PRABHAKAR SHIVARAM HEGDE, Vide Affidavit Dated 02/01/2024 at Hyderabad [H-788184]

■ I, Sistla Rathnam R/o. MIG-A-176, Dr.A.S.Raonagar, Ecil, kapra, Hyderabad After my marriage changed my name from: CH. Ratnam D/o. CH.V.S.Prasad to Sistla Rathnam W/o. S.Syamala Varaprasad [HA-980]

■ I, THANAGUNDLA FATHIMA W/o THANAGUNDLA MADHU R/o Plot No - 3, North Gate Avenue, Mamidipally Road, Shamshabad, RR Dist- 501218. Changed My Name as "SALIBINDLA FATHIMA" for All Records. [HA-13254]

LOST

■ I, E.JOHN S/o E.SUBBA RAYUDU, R/o H.No: 3-13- 37/2, Surya Nagar, Mallapur, Hyd-76,TS. I Lost/Misplaced Gift (Settlement) Deed Original & link Document No: 5502 / 2006 Registration From SRO Uppal,If Any found Please Call.9849423117. [H-788122]

Wanted

■ రిసెప్షనిస్ట్, టెలికాలర్, టైపింగ్, కలెక్షన్స్ MKTG, యాంకర్లు, DTP, హెల్పర్స్, డ్రైవర్లు, సూ"వైజర్, గార్డెన్ వర్కర్లు, మేనేజర్లు, జీ॥ 15 -20K, ఫ్రీ రూం మీల్స్ @ ఫోన్: 9505288777. [H-788179]

■ ముంబై హైవేలోని మా సంస్థ నందు 1001 ఎకరాల గేటెడ్ కమ్యూనిటి DTCP & రేరా మరియు బ్యాంకు లోన్‌తో రిసార్ట్స్ ఉన్న కంపెనీకి అనుభవం ఉన్న "మార్కెటింగ్ డైరెక్టర్స్" కావలెను. కలలో కూడా ఊహించని ఇన్సెంటివ్స్ + గిఫ్ట్స్ + అవార్డ్స్ + ఫారిన్ ట్రిప్స్. 9133699328. [HA-111]

■ Nest Infra Developers కొరకు మార్కెటింగ్ చేయుటకు ఏజెంట్స్ కావలెను Age: 18–35, జీతం: 15,000 & కమీషన్, హబ్సిగూడ, Hyd. 7672099306. [H-788183]

■ హరేకృష్ణ హోంకేర్ హైదరాబాద్ నందు వృద్ధులను,పేషెంట్స్‌ను చూసుకొనుటకు వర్కర్స్ /నర్సులు కావలెను.ఫ్రీ వసతి+భోజనం. జీ. 18 K. ఫోన్: 9640258899 / 9640468899. [H-793668]

■ షిర్డీసాయి వృద్ధుల ఆశ్రమము హైదరాబాద్‌లో పనిచేయుటకు లేడీ సూపర్‌వైజర్స్, నర్సులు, ఆయాలు, వార్డ్ బాయ్స్, కాంపౌండర్స్ భార్యాభర్తలు కావలెను. ఫోన్: 9391036931, 9246585901. [HA-12597]

■ Urgent Required Female Tele callers and System Operators, Direct Job, Good Salary+ incentives@ Basheer Bagh,Hyd Ph:9666609812 [HA-1062]

■ Wanted Graphic Designer for packaging products 2-5 year Exp. skills Coreldraw, Photoshop. Near Uppal. Ph: 6304933646. [H-788058]

■ Wanted Vice-Principal, Social, English, bio/ Phy-Science, P.E.T, Hindi, Comp for Classes 6th to 10th, English, Science Social for 1st to V th Class Nadergul, Kongara. 8790190846, 8977683579 [H-787707]

గమనిక

సాక్షి తెలుగు దినపత్రికలో రోజూ ప్రచురించే క్లాసిఫైడ్ ప్రకటనలు చదివి, వాటిని నిశితంగా పరిశీలించిన పిదప ప్రతిస్పందించాల్సిందిగా మా పాఠకులను కోరడమైనది. ప్రకటనదారు తెలిపే లేదా క్లెయిమ్ చేసే వాటితో ఈ వార్తా పత్రికకు ఎలాంటి సంబంధం లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.

ఈ సెక్షన్‌లో ప్రకటనల కొరకు

సాక్షి క్లాసిఫైడ్స్

3+2 3 ప్రకటనలకు చెల్లించండి, 2 ప్రకటనలు ఉచితంగా పొందండి

హైదరాబాద్ సిటీ ఎడిషన్‌లో 5 ప్రకటనలకు రూ. 2280/- (4 లైన్లు). ప్రతి అదనపు లైనుకు రూ. 540/-

గమనిక : జాప్తై మీరు ఇచ్చే అన్ని ప్రకటనలపై 5% GST అదనం

జోన్ సెంటర్స్

దిల్‌సుఖ్‌నగర్	9912348016	రాజేంద్రనగర్	9010202372
ఎల్.బి.నగర్	9912225475	కూకట్‌పల్లి	9912225476
తార్నాక	9010202751	బాలానగర్	9951602997
సికింద్రాబాద్	9010299013	మల్కాజ్‌గిరి	9505507562
చిక్కడపల్లి	9010188892	మెహదీపట్నం	9912225468
అబిడ్స్	9705144457	చందానగర్	9010213322
అమీర్‌పేట్	9505507563	ఉప్పల్	7095250115

వివరాలకు : 6-2-249/1, సాక్షి టవర్స్, రోడ్ నెం. 1, బంజారాహిల్స్, హైదరాబాద్ - 34

Ph: 040-2325 6000, Ext : 6235 Cell : 9912225453